సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 4 | ఫిబ్రవరి | 2024

వైఎస్సార్‌కు నివాళి



కిక్కిరిసిన జాతీయ రహదారి



● ఏలూరు.. జనహోరు



దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సార్వత్రిక పోరుకు 'సిద్ధం'

- ఎన్నికల శంఖారావం **పూరించిన** సీఎం వైఎస్ జగన్
- జన సునామీని తలపించిన దెందులూరు సహారా **గ్రౌండ్స్**
- కోస్తాంధ్ర నుంచి లక్ష**లాది మంది రాక**
- మండుటెండను సైతం **లెక్కచేయని వైనం**
- అంచనాలకు మించిన జనంతో కిక్కిరిసిన **ప్రాంగణం**
- పార్టీ శ్రేణుల్లో సమరో**త్సాహం నింపిన** ముఖ్యమంత్రి ప్రసంగం
- ఏలూరు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సభ

సమరోత్సాహం

కృష్ణా, గోదావరి పరవళ్లు తొక్కినట్టుగా.. కొల్లేరు ఉప్పొంగినట్టుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరిస్తూ ఏలూరు జిల్లా దెందులూరు వేదికగా నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభ జన సునామీని తలపించింది.. నేల ఈనిందా.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా పూర్వ ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. జై జగన్.. జైజై జగనన్న నినాదాలతో మార్మోగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా మధ్యాహ్నం నుంచి ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకుని జననేత రాక కోసం ఎదురుచూశారు.

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల భేరీ మోగిస్తూ ఏలూరు జిల్లా దెందులూరులోని సహారా గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' భారీ బహిరంగ సభకు కోస్తాంధ్రలోని పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 50 నియోజకవర్గాల నుంచి వందలాది బస్సులు, వేలాది కారుల్లో లక్షలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఏలూరు చరిత్రలో ఇదే అతి పెద్ద సభ కావడం విశేషం. సీఎం జగన్ మధ్యాహ్నం 3.30 గంటలకు సభావేదిక వద్దకు రానుండగా గ్యాలరీల్లో కూర్చుని ఆయన్ను చూడాలన్న ఆశతో మండుటెండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవడం ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటల సమయానికి 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన గ్యాలరీలన్నీ జనంతో నిండిపోయాయి. గ్రౌండ్ ఖాళీ లేక పోవడం, అంచనాలకు మించి జనం రావడంతో మిగిలిన వారు సభా ప్రాంగణాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై నుంచి సభను వీక్షించారు. మధ్యాహ్న సమయంలో 33 డిగ్రీలకు పైగా ఎండ ఉన్నా ప్రజలు ఏమాత్రం పట్టించుకోకుండా సీఎం జగన్ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా దాహార్తిని తీర్చేందుకు ముందుగానే భారీ ఎత్తున గ్యాలరీల వద్ద చల్లటి మజ్జిగ ప్యాకెట్లను నాయకులు అందుబాటులో ఉంచారు.

18 నిమిషాల పాటు వాకింగ్‌వే పైనే..

మధ్యాహ్నం 3.45 గంటల సమయానికి సభా ప్రాంగణానికి చేరుకున్న సీఎం జగన్ వేదికపై ఉన్న నాయకులను పేరుపేరునా పలకరించారు. దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నేరుగా సభా ప్రాంగణం మొత్తం కవర్ చేస్తూ ఫ్యాను ఆకారంలో ఏర్పాటుచేసిన వాకింగ్‌వే పైకి చేరుకున్నారు. పది నిమిషాల పాటు ప్రజలందరికీ అభివాదం చేస్తూ వాకింగ్‌వే మొత్తం తిరగడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ప్రసంగం అనంతరం కూడా ఆయన మరోమారు వాకింగ్‌వే మీదుగా జనం మధ్యలోకి వచ్చారు. ఎనిమిది నిమిషాల పాటు ప్రజలను పలకరిస్తూ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. ఈ క్రమంలో ఒక యువకుడు సెల్ఫీ కోసం వాకింగ్‌వే పైకి దూసుకురాగా సెక్యూరిటీ ఆపుచేసే ప్రయత్నం చేసింది. సీఎం జగన్ వారిని వారించి యువకుడిని నవ్వుతూ పలకరించి సెల్ఫీ దిగారు.



మేము సైతం సిద్ధం

ప్రగతిని వివరిస్తూ.. కుట్రలను ఎండగడుతూ..

సీఎం జగన్ దాదాపు 70 నిమిషాల పాటు ప్రసంగించి 57 నెలల్లో కనీవినీ ఎరుగని రీతిలో పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి తెచ్చిన విప్లవాత్మక మార్పులు వివరిస్తూ.. ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలను ఎండగడుతూ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపారు. 'దిగజారుడు పార్టీలన్నింటికీ జగన్ టార్గెట్, పేదల భవిష్యత్ టార్గెట్, సంక్షేమం టార్గెట్.. వారితో యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా..' అని సీఎం జగన్ అన్నప్పుడు 'ఎంతమంది కలిసొచ్చినా ఎదురించేందుకు మేం సిద్ధం' అంటూ ప్రజలు నినదించారు. 'కౌరవ సేనను మరలా ఓడించేందుకు.. మరో గొప్ప విజయం సాధించేందుకు మీరు సిద్ధమా' అని సీఎం జగన్ అన్నప్పుడూ 'మేము సిద్ధమే' అంటూ గొంతెత్తారు. సీఎం జగన్ ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో యువకులు, మహిళలు, అభిమానులు మద్దతు పలికారు. ప్రజల ఉత్సాహం చూసి ముఖ్యమంత్రి సైతం చిరునవ్వుతో అభివాదం చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయకపోగా అవినీతి, అభూత కల్పనతో పాలన సాగించారని విమర్శించినప్పుడు 'నిజం' అంటూ ప్రజలు మద్దతు తెలిపారు. దుష్టచతుష్టయానికి దత్తపుత్రుడు తోడయ్యాడు.. ఒక్కరూ ఇక్కడ ఉండరూ అంతా నాన్ రెసిడెంట్ ఆంధ్రాస్ అన్నప్పుడు 'అవును' అంటూ గొంతు కలిపారు. ఇలా ఆద్యంతం సీఎం ప్రసంగం కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది.



అభిమాన తరంగం.. వాకింగ్ వేపై నడుస్తూ అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



విజయమే లక్ష్యంగా..

సిద్ధం సభలో సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, తానేటి వనిత, జోగి రమేష్, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, ఎంపీలు నందిగం సురేష్, కేశినేని నాని, మార్గాని భరత్, కోటగిరి శ్రీధర్, చింతా అనురాధ, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వంగా గీత, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, కురసాల కన్నబాబు, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, విప్ గ్రంధి శ్రీనివాస్, చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, దూలం నాగేశ్వరరావు, తెల్లం బాలరాజు, మేకా వెంకటప్రతాప్ అప్పారావు, పుప్పాల వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఏలూరు, నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్తలు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, గూడూరి ఉమాబాల, పాలకొల్లు, చింతలపూడి సమన్వయకర్తలు గుడాల గోపి, కంభం విజయరాజు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



ఉరిమే ఉత్సాహంతో.. సీఎం జగన్ ప్రసంగానికి జేజేలు పలుకుతున్న పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు

సభ సూపర్ సక్సెస్



ఆళ్ల నాని | కారుమూరి సునీల్‌కుమార్ | కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ **మోహన్‌రెడ్డి 'సిద్ధం'** ఎన్నికల సన్నాహక భారీ **బహిరంగ సభను** సూపర్ సక్సెస్ చేసిన **వైఎస్సార్‌సీపీ కుటుంబ** సభ్యులు, నాయకులకు, శ్రేణులు, వలంటీర్లకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌పై, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి సిద్ధం సభ భారీగా విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి హాజరై, తమ అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు.

తీన్‌మార్ నృత్యాలతో జోష్

యువకులు తీన్‌మార్ నృత్యాలు చేసుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సిద్ధం, సీఎం జగన్ ప్లకార్డులతో సభాప్రాంగణం వద్ద యువత ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. సభ ప్రారంభానికి ముందు సీఎం జగన్ పాలనలో జరిగిన రాష్ట్రాభివృద్ధిని వివరిస్తూ ప్రముఖ కళాకారిణి వంగపండు ఉష బృందం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 'గిరా గిరా తిరుగుతుంది ఫ్యాను.. అయ్యా నేను జగనన్న ఫ్యాను' పాట ప్రాంగణంలోని వారిలో ఫుల్‌జోష్ నింపింది. యువకులు ఉత్సాహంగా కుర్చీల్లోంచి లేచి స్టెప్పులు వేసి కేరింతలు కొట్టారు. మధ్యాహ్నం 3.40 గంటల సమయానికి సభావేదిక సమీపంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు సీఎం జగన్ హెలికాప్టర్ చేరుకుంటున్న సమయంలో సభలోని జనం అంతా పైకి లేచి చేతులు ఊపుతూ స్వాగతం పలికారు.

నయా జోష్‌తో 'సిద్ధం'

తండ్రిని మించిన తనయుడు



పాదయాత్రలోనే మీ కోసం వైఎస్సార్ ఎంతో చేశారు. అంతకు మించి మరో అడుగు ముందుకేసి మంచి చేస్తా అని జగన్ చెప్పినట్టుగా అధికారంలోకి వచ్చిన వెంటనే చేసి చూపించారు. నవరత్నాలు, ఆరోగ్యశ్రీతో పాటు విద్య, ఇతర ఎన్నో పథకాలు సమర్థవంతంగా అమలు చేశారు. తండ్రిని మించిన తనయుడిగా రాజకీయాల్లో జగన్ ఎదిగారు.

– అజేష్, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా

ప్రతిపక్షాలు భయపడుతున్నాయ్



తనకన్నా చిన్న వయస్సులో ఉన్న యువకుడిని చూసి 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు వైఎస్ జగన్ అన్నా, వైఎస్సార్ సీపీ అన్నా భయం పట్టుకుంది. ఎన్నికల్లో నేరుగా గెలవలేమని నిర్ధారణకు వచ్చారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై భయపడుతున్నాయి. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో రెండో సారి జగన్ సీఎం కావడం తథ్యం.

– పీ.పద్మ,మండపేట, తూర్పుగోదావరి జిల్లా

ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా



తన పాలనలో ఇంత మంచి జరిగింది అని సీఎం వైఎస్ జగన్ ఓటు అడుగుతున్నారు. చంద్రబాబు తన పాలనలో మేము చేసిన మంచిని చెప్పి మరోసారి సీఎం చేయమని ప్రజలను అడగగలరా? ఒంటరిగా పోటీ చేసే దమ్ము టీడీపీకి, జనసేకు ఉందా? చంద్రబాబుకు మద్దతునిచ్చే పవన్ ఏముఖం పెట్టుకుని ప్రజలను ఓటు అడుగుతారు?

– డీ.గణేష్, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా

వివక్ష లేకుండా అందరికీ పథకాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా కుల,మత వర్గాలు చూడకుండా నాలుగున్నరేళ్ళుగా అమలు చేసిన అన్ని పథకాలు వివక్ష లేకుండా ప్రజలకు అందించారు. కచ్చితంగా ప్రజలందరూ మళ్ళీ జగనన్ననే సీఎం చేస్తారు. జగనన్నకే మా మద్దతు.

– శ్రీను, అనపర్తి,తూర్పుగోదావరి జిల్లా



సిద్ధం సభకు తరలివచ్చిన అశేష ప్రజానీకానికి చేతులెత్తి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తరలివచ్చిన జన గోదావరి



సభలో సిద్ధం కటౌట్‌లను ప్రదర్శిస్తున్న అభిమానులు

ఏలూరు సమీపంలోని సహారా గ్రౌండ్స్‌లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సిద్ధం సభకు ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారి జనగోదారైంది. 50 నియోజకవర్గాల నుంచి వేలాదిగా వాహనాల్లో సభకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వందలాదిగా బస్సులు, వేలాదిగా కార్లు, ఇతర వాహనాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ట్రాఫిక్‌కు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా ముందుగానే పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలకు దెందులూరు వెళ్లే రోడ్డు వైపు, ఏలూరు, కైకలూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆటోనగర్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు. అయితే అంచనాలకు మించి సిద్ధం సభకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. సభకు వచ్చిన వారికి అసౌకర్యం కలుగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

– సాక్షి, భీమవరం

ఉరకలెత్తిన అభిమానం



ఎగరాలి జెండా.. ఎదురులేకుండా..

సార్వత్రిక ఎన్నికలకు సమర శంఖారావం పూరిస్తూ వైఎస్సార్ సీపీ నిర్వహించిన సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ అభిమానులు, యువకులు ఉరకలెత్తారు. కొంతమంది పార్టీ జెండా రంగులను దేహంపై వేసుకుంటూ, పార్టీ జెండాలను చేతబూని జైజగన్ అంటూ నినదించారు.

– సాక్షి నెట్‌వర్క్




గుండె నిండా.. అభిమానం మెండుగా..




మేము సైతం..

రాజకీయ సభలోనూ.. ప్రజారోగ్యంపై శ్రద్ధ



ఏలూరు జిల్లా సిద్ధం సభా ప్రాంగణంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు టౌన్: ప్రజా సేవే పరమావధిగా ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరైన సిద్ధం సభా ప్రాంగణం వద్ద పార్టీ నేతలు ప్రజలకు సేవలందించటమే ప్రధాన అజెండా అంటూ నిరూపించారు. రాజకీయ సభలోనూ ప్రత్యేకంగా రెండు హెల్త్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సభకు తరలివచ్చిన ప్రజలకు ఆరోగ్య సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అన్ని రకాల మందులు, ప్రాథమిక వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టారు. వృద్ధులు, దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు అక్కడ తమ ఆరోగ్య పరిస్థితిని చెక్ చేయించుకుని మందులు తీసుకున్నారు. ప్రజల కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం తపిస్తారనేందుకు ఇదొక తార్కాణంగా నిలుస్తుందనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేశారు. ఇక ఎండవేడిమి నుంచి ఉపశమనానికి సైతం ప్రజలకు లక్షల సంఖ్యలో మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచటం ప్రజల ఆరోగ్యంపై వైఎస్సార్‌సీపీకి ఉన్న శ్రద్ధను సుస్పష్టం చేస్తోంది.

అభిమానం.. అపరిమితం



సిద్ధం సభా ప్రాంగణంలో పార్టీ రంగులు చేతిపై వేయించుకుంటున్న ఒంగోలుకు చెందిన కరీం

ఏలూరు టౌన్ : సభా ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ జెండా రంగులను చేతిపై వేయించుకుంటూ పార్టీపై తమకున్న మమకారాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు. మహిళలు, వృద్ధులు, యువత అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ జెండా రంగులను వేయించుకోవటం విశేషం. ఒంగోలుకు చెందిన కరీం సిద్ధం సభకు వచ్చి పార్టీ జెండా రంగులు తన చేతిపై వేయించుకుని తన అభిమానాన్ని చాటుకున్న దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. జగన్ ఒంటరివాడు కాదు.. మీరంతా నా వెంటే.. పైన దేవుడు ఉన్నాడు.. మీరంతా నాతో ఉన్నారంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిసారీ చెప్పే మాటలు ఎంత నిజమో వీరిని చూస్తే అర్థమవుతుంది.

పటిష్టంగా భద్రత

ఏలూరు టౌన్ : సిద్ధం భారీ బహిరంగ సభకు ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పోటెత్తిన నేపథ్యంలో సభా ప్రాంగణం వద్ద ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ నేతృత్వంలో ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సభా ప్రాంగణంలోకి వెళ్ళేందుకు డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ప్రతీ ఒక్కరినీ పరిశీలిస్తూ, లోనికి అనుమతించారు. సుమారుగా 20కి పైగా డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి వాటిలో నుంచి లోనికి వెళ్ళేలా ఏర్పాటు చేశారు. ప్రాంగణం వెలుపల ప్రత్యేకంగా పోలీస్ హెల్ప్ డెస్క్‌ను సైతం ఏర్పాటు చేశారు.


ముగిసిన ఉల్కాన్‌జీ వేడుకలు



ఉల్కాన్‌జీ వేడుకల్లో నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం: సృజనాత్మకత, ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఎల్లవేళలా డిమాండ్ ఉంటుందని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. ఏపి నిట్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఉల్కాన్‌జీ సాంకేతిక ఉత్సవం శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి మాట్లాడుతూ కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే గీటురాయన్నారు. మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా ఎనాలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి వాటిలో పట్టు సాధించిన విద్యార్థులకు కంపెనీలు ఎర్రతివాచీ పరుస్తున్నాయన్నారు. మౌలిక భాషలపై పట్టు ఉంటేనే ఆయా రంగాల్లో కొత్త విషయాలు తెలుసుకొనే శక్తి సామర్థ్యాలు విద్యార్థులకు అలవాటు అవుతాయన్నారు. సీఎస్ఈ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో నిర్వహించిన టెస్ట్ యువర్ సెలెక్ట్ ఫన్నీగేమ్, శ్రేష్టాక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన బాల్ షూటింగ్, డ్రైవ్ డాస్, వంటికి ఆలోచింపచేశాయి.

లంక భూములపై రైతులకు హక్కులు



పట్టాలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: గోదావరి లంక భూములపై రైతులకు హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని రాజుల్లంక పంచాయతీకి చెందిన 86 ఎకరాల లంక భూములను సీ-నమూనా పట్టాలుగా రెన్యూవల్ చేసి సంబంధిత పట్టాలను శనివారం ముదునూరి తన కార్యాలయంలో రైతులకు అందించారు. మొత్తం 69 మంది రైతులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ తీరంలో డి-నమూనా పట్టాభూములు, సీ-నమూనా పట్టా భూములు పూర్వం నుంచి అనుభవిస్తున్న రైతులకు ఆ భూములపై ఎలాంటి అధికారాలు లేకుండా ఉన్నాయని అన్నారు. మొదటి సారిగా ప్రభుత్వ భూములను జిరాయితీ భూములుగా మార్చి రైతులకు అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. నరసాపురం సముద్ర తీరంలో 20 వేల ఎకరాల డి-నమూనా పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫాజిల్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా.. ఉనికిని చాటేలా..

'మ్యారేజ్ బ్యాండ్' చిత్రంపై నాయీబ్రాహ్మణ సంఘం



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వాయిద్య కళాకారులు, నాయీబ్రాహ్మణ కులవృత్తుల మనోభావాలను కించపరచకుండా మంచి సందేశాత్మకంగా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రం తెరకెక్కించడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ములూరి శ్రీహరిరావు అన్నారు. శనివారం స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజిక వర్గాల వారందరికీ వర్తింపజేసేలా చక్కగా చిత్రించారని చెప్పారు. చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సభ్యులు ఉప్పలపు పెద్దిరాజు, కె.శివప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఈదూరులో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈదూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాత సహకారంతో అన్నదానం చేశారు.

రెండు రోజుల పాటు గేట్ ప్రవేశ పరీక్ష


గేట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కేంద్ర ప్రభుత్వ సాంకేతిక విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ప్రవేశ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే గేట్ ప్రవేశ పరీక్ష కోసం తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం శనివారం ఉదయం, సాయంత్రం మొత్తం రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహించగా ఉదయం 138 మందికి గాను 103 మంది, సాయంత్రం 230 మందికి గాను 215 మంది పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, కో ఆర్డినేటర్ నటరాజ్, అడ్మిన్ కొల్లా సురేష్, ఐఐటీ, ఖరగ్‌పూర్ నుంచి వచ్చిన పరీక్ష నిర్వాహకులు పర్యవేక్షించారు.

రెవెన్యూ ఉద్యోగుల ధర్నా


తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: విశాఖలో తహసీల్దార్ రమణయ్య హత్యకు వ్యతిరేకంగా శనివారం తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ రమణయ్య హత్యకు కారకులైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం కుటుంబాలను పక్కన పెట్టి విధి నిర్వహణ చేస్తున్న ఉద్యోగులపై దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభు కుమార్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయ పరిపాలనాధికారి నరసింహారావు, పోతురాజు, వీఆర్వోలు శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీవీ రామకృష్ణకు అభినందనలు


రామకృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

పెంటపాడు: పెంటపాడుకు చెందిన ఎంఈవో-2 టీవీ రామకృష్ణ ఏపీ మండల విద్యాశాఖాధికారుల-2 రాష్ట్ర కన్వీనర్‌గా ఎంపికైన సందర్భంగా శనివారం సాయంత్రం పెంటపాడులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల సమావేశ మందిరంలో పలు ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. టీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఎంఈవో-2 సంఘానికి తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేసుకొన్న సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ టీఎఫ్ సంఘ నాయకులు రమేష్, స్టాన్లీ బాబు, పలు సంఘాలకు చెందిన మీసాల శామ్యూల్‌రాజు పలు సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలి

తణుకు టౌన్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని తణుకు పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం ఏడుకొండలు సూచించారు. శనివారం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల గృహాలను హెచ్ ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సందర్శించి విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీవీలకు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులకు తమ సబ్జెక్ట్‌ల పట్ల వచ్చే సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు మేము సైతం

- గర్జించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఏలూరు జిల్లా దెందులూరులో బహిరంగ సభ


తాడేపల్లిగూడెం రూరల్: ఎల్.అగ్రహారం గ్రామంలో నీలపాల రామన్న ఆధ్వర్యంలో సిద్ధం సభకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి దెందులూరు జాతీయ రహదారిని ఆనుకుని శనివారం జరిగిన సిద్ధం సభకు 60 బస్సుల్లో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ప్రధానంగా జగన్నాథపురం, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, కృష్ణాయపాలెం, నవాబుపాలెం, నందమూరు, మాధవరం, అప్పారావుపేట, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, బంగారుగూడెం, చినతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, కుంచనపల్లి, ఉప్పరగూడెం, మెట్ట ఉప్పరగూడెం, దండగర్ర, నీలాద్రిపురం తదితర గ్రామాల నుంచి బయల్దేరి వెళ్లారు. పార్టీ అభిమానులు, నాయకులు స్వచ్ఛందంగా బస్సుల్లో సిద్ధం సభకు తరలివెళ్లడం విశేషం. దీంతో ఏ రహదారి చూసినా బస్సులతో కిక్కిరిసి కనిపించాయి. జై జగన్ అనే నినాదం మార్మోగింది. పలువురు వృద్ధులు వైఎస్సార్‌సీపీ జెండాలను ధరించి పార్టీ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, పచ్చా బేబి రాణి, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీ విశ్వనాథం, ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్ గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సిద్ధం' సభకు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమరశంఖం పూరిస్తూ ఏలూరులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పెంటపాడు మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా 24 బస్సుల్లో పలు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా పార్టీ కార్యకర్తలతో పాటు, ప్రజలు, మహిళలు ముఖ్యమంత్రి జగనన్న సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి వచ్చిన బస్సులు పెంటపాడు ఎస్టీవీఎస్ స్కూల్‌కు చేరుకొన్నాయి. అక్కడ పార్టీ నాయకులు జెండాలు ఊపి బస్సులను సభలకు తరలించే ఏర్పాటు చేశారు. పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్యలతో పాటు, పెంటపాడులో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్‌లు కర్రి వరహాల రెడ్డి, సలుమూరి ప్రకాష్, బర్ల జయరాంబాబు, కొండేపాడు గ్రామం నుంచి పార్టీ మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, రామచంద్రపురం గ్రామం నుంచి చల్లా లింగమూర్తి, కుమారస్వామి, విప్పర్రు నుంచి బోణం వీరయ్య, పసల గంగారామచంద్రన్ కోసూరి వెంకట్రాజు, పరిమెళ్లగ్రామం నుంచి సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దెందులూరు సిద్ధం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

తణుకు టౌన్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి దెందులూరు జాతీయ రహదారిని అనుకొని శనివారం జరిగిన సిద్ధం సభకు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తణుకు నియోకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శనివారం ఉదయం నుంచి వివిధ గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు కార్లలో తరలి వెళ్లారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో ప్రైవేట్ బస్సులు, కార్లలో బయలు దేరి వెళ్లారు. వేల్పూరు ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గ ప్రసాద్, దువ్వ గ్రామంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. తణుకు తేతలి వైజంక్షన్ వద్ద దెందూలూరు సిద్ధం సభకు పట్టణానికి పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మహిళా అధ్యక్షురాలు నూకల కనక దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు తరలివెళ్లారు.


తణుకు టౌన్: మండపాకలో సిద్ధం సభకు బస్సులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పెంటపాడు: అంబేద్కర్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆటో, ట్రక్కు ఆటో ఢీ

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో శనివారం ఆటో, ట్రక్కు ఆటో ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయ్యాయి. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు తెలిపారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ఆకివీడు: స్థానిక పల్లెవీధిలో మద్యం తాగి భర్త వేధిస్తున్నాడని భార్య కొల్లాటి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగబాబు తెలిపారు. గతంలో ఆమె భర్తకు పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

నులి పురుగుల నిర్మూలనను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో శివన్నారాయణరెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ఈనెల 9వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఆయన సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలు జిల్లాలో 3,25,385 మందిని గుర్తించామని వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.భాను నాయక్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బి.గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వాకపల్లి ప్రసాద్, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ భావన, విద్యాశాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, ఇంటర్మీడియట్ బోర్డు డీఈఈవో నరసింహమూర్తి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వీఎస్ఆర్‌కే కె.కుమారి, ఐసీడీఎస్ ఏవో సీహెచ్ సుజాత లక్ష్మి, డాక్టర్ పద్మ, డీపీవో పి.సురేష్, ఎన్‌డీడీ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాడపల్లి వెంకన్న కల్యాణం


వాడపల్లి వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు


వెంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శనివారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారి రథాన్ని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గృహం వద్ద నుంచి భారీ ఊరేగింపుతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. స్వామి వారి ఊరేగింపు పట్టణ వీధిల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఏడు దర్శనాల వేంకటేశ్వరుడిగా పేరుగాంచారు. అదేవిధంగా స్వామికి ఏడు ప్రదక్షిణలు చేసి ఏడు వారాలు దర్శనం చేసుకుంటే స్వామివారి కరుణాకటాక్షాలకు పాత్రులు అవుతారు. ఇదే విధంగా శ్రీబలుసులమ్మ ఆలయం వద్ద వాడపల్లి వెంకటేశ్వర స్వామిని ఏర్పాటు చేసి ఏడు ప్రదక్షిణలు భక్తులు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చి స్వామికి ఏడు ప్రదక్షిణలు చేసుకుని ఆనందపరవశులయ్యారు. అనంతరం స్వామి వారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి వాడపల్లి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు కల్యాణం నిర్వహించారు. భక్తులకు స్వామివారి అక్షింతలను, తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానం ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఈఓ బుచ్చిబాబు, శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ రవిశంకర్, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, గార్లపాటి వీరబాబు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆడ పిల్లలపై వివక్ష తగదు


తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పెంటపాడు : బేసిక్‌స్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సూర్యకళ

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలను నిర్లక్ష్యం చేయవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెదతాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రం.2 ఆధ్వర్యంలో ఆడపిల్లలని రక్షించు – ఆడపిల్లలని కాపాడు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ ఆడపిల్లని నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యానికి దారి తీస్తుందన్నారు. బాలికలను చదివించడం ద్వారా సమాజం పురోగతి చెందుతుందన్నారు. బాలికలను చదివించడం తల్లిదండ్రులు తమ కర్తవ్యంగా భావించాలన్నారు. అలాగే బాధ్యతగా ఆడపిల్లలను పెంచాలన్నారు. అనంతరం ఎం.హిందూజను సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, పరిమి ప్రసాద్, కారింకి వీర్రాజులు సన్మానించారు. ఆరుగొలను సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోనూ భేటీ బచావో... భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా బాలికలను చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి రామావతారం, శీలి మోహన్ రావు, ఎంఎల్‌హెచ్‌పీ కృప, జీఎంఎస్‌కే భాను, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే.కాజు, బి.రాణి, జి.సూర్యనాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు జి.గంగాభవాని, టి.భవానీ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడ పిల్లలపై వివక్ష వద్దు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఆడ పిల్లలపై వివక్ష చూపవద్దని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి అవగాహన కల్పించారు. బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలో అవగాహన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ కుటుంబంలో ఆడపిల్ల పుడితే జన్మదినోత్సవం జరపాలని, కట్నం ఇవ్వకూడదని, తక్కువ ఖర్చుతో వివాహం చేసే సాంప్రదాయాన్ని తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్‌కే దుర్గా భవాని, కె.విశాలక్ష్మి, కార్యకర్తలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే ప్రగతి సూచిక

పెంటపాడు: మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే దేశ ప్రగతికి సూచిక అని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్, 11వ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆధ్వర్యంలో బేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆడపిల్ల జన్మిస్తే ఒక పండుగలా వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రత్తిపాడులో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని పాల్గొన్నారు. విప్పర్రులో జీజీబీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు


తణుకులో రామకృష్ణ సేవా సమితి భవన్‌లో సంగీత ఉత్సవాల్లో కచేరి చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో 85వ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలు తణుకులో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. తణుకులోని రామకృష్ణ సేవా సమితి భవన్‌లో ఈ సంగీత ఉత్సవాలను సొసైటీ సభ్యురాలు చిలుకూరి సుజాత ప్రారంభించారు. గత 25 సంవత్సరాలుగా త్యాగరాజ స్వామి ఆరాధన సంగీత ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత కళాకారులతో కచేరీలు నిర్వహిస్తున్నారని ఉత్సవ పరిశీలకురాలు భమిడి కమలాదేవి తెలిపారు. శనివారం సంగీత ఉత్సవ కార్యక్రమంలో శ్రీకాకుళం, తిరుపతి, చెన్నైలకు చెందిన సంగీత కళాకారులు సుందరపల్లి శ్రీనివాస్ శాక్సోఫోన్, హేమాద్రి చంద్రకాంత్ వయోలిన్, కందుర్తి ఆరవింద్ మృదంగం, బుద్ధవరపు మారుతీ రఘురామ్ ఘటం వాయిద్య కారులతో సంగీత కచేరి నిర్వహించినట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివి


ఏరియా ఆస్పత్రిలో వైద్యులను సత్కరిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మహిళా వైద్యులు సూరప్ప రమాదేవిని, కేఈ కమలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు చిక్కాల భ్రమరాంబికా, లియో లయన్స్ జాయింట్ సెక్రటరీ ఆకాశపు సాయి శృతి, వశిష్ఠ లియో క్లబ్ అమృత నందిని తదితరులు పాల్గొన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నర్సింగ్ విద్యార్థులచే స్థానిక ఏరియా ఆస్పత్రిలో మహిళా డాక్టర్స్‌ను సత్కరించి, స్వీట్లు అందజేశారు. నర్సింగ్ విద్యార్థులు డి.ప్రియాంక, ట్యూటర్ ఎస్.వినీత పాల్గొన్నారు.